క్లుప్తంగా

సత్తెనపల్లి తహసీల్దారుగా సురేష్



సత్తెనపల్లి: సత్తెనపల్లి తహసీల్దారుగా ఎస్.సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్ గా పని చేసిన కె.నగేష్ సాధారణ బదిలీల్లో భాగంగా మాచవరంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నకరికల్లు తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న సురేష్ బదిలీ పై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తహసీల్దార్ సురేష్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ముందుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును, సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్.రాజకుమారిని వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

మాదలలో జనభాగీదారి కార్యక్రమం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల-1 సచివాలయం పరిధిలోని మైనార్టీ అంగన్‌వాడీ కేంద్రంలో జనభాగీదారి కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎమ్.అనంతలక్ష్మి పాల్గొని తల్లులు ఇళ్లలో లభించే నిరుపయోగమైన వస్తువులతో పిల్లల అభివృద్ధికి సంబంధించిన వస్తువులను తయారు చేసుకోవాలన్నారు. ఈ విధంగా తయారు చేసిన వస్తువులతో చేపట్టే బోధన తీరును తల్లులకు వివరించారు. ఆట పాటల ద్వారా బోధన చేపట్టినట్లయితే చిన్నారులకు సులభంగా అర్థమవుతుందని,ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యలవర్తిపాటిసైదా, స్థానికులు గుంటూరుసైదా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతి: స్థానిక అమరావతి ఐసిడిఎస్‌సెక్టార్‌లో 7,10 అంగన్‌వాడీ సెంటర్‌ల పరిధిలో బుధవారం జనబాగీదారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రీస్కూల్ పిల్లలందరిని అంగన్వాడీ సెంటర్‌లలో చేర్పించాలని ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని చిన్నారులకు ఎటువంటి వత్తిడి లేకుండా ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తామని, చిన్నారుల కు, బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని అంగన్వాడీ టీచర్లు సుబాషిణి, సాహినాలు వివరించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీకేంద్రాలలో యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్‌లు పంపిణీ చేశారు. ఈ ర్యాలీలో అంగన్‌వాడీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా పుట్టారెడ్డి తిరిగి విధులకు హాజరు

ముప్పాళ్ళ: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పీ.పుట్టారెడ్డి బుధవారం తిరిగి విధులకు హాజరయ్యారు. గత కొంత కాలంగా సివిల్స్ పరీక్షల నిమిత్తం సెలవుపై వెళ్ళారు. సెలవులు ముగియటంతో తిరిగి విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గా కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస రావు వ్యవహరించారు.

ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పబ్లిక్ బెటర్‌మెంట్ పరీక్షా ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ జడ్ఎస్ రామ చంద్రరావు అన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూప్ నందు 470 మార్కులకు గాను కె.శ్వేత నందిని 463 మార్కులు, డి.సూర్యతేజ 456 మార్కులు, యస్. సాయి వైష్ణవి 423 మార్కులు సాధించారన్నారు. అలాగే బైపీసీ గ్రూప్ నందు 440 మార్కులకు గాను బి. సిరి 428 మార్కులు, సి.హెచ్. తులసి 416 మార్కులు, యస్. కరుణాకర్ రెడ్డి 412 మార్కులు, సి.హెచ్. భార్గవి 402 మార్కులు సాధించారన్నారు. సెరికల్చర్ గ్రూప్ నందు 500 మార్కులకు గాను యస్. శివగణేష్ 440 మార్కులు, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ గ్రూప్ నందు 500 మార్కులకు గాను టి. ఏడుకొండలు 422 మార్కులు సాధించారన్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను ప్రిన్సిపాల్ రామ చంద్రరావు, కళాశాల అధ్యాపకులు బుధవారం అభినందించారు. 2023-24 అకడమిక్ ఇయర్ కు సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయని, అడ్మిషన్ల కొరకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఏజీబిఎస్‌లో సుస్మితరెడ్డికి 554వ ర్యాంక్



రాజుపాలెం: ఏజీబిఎస్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 554 వ ర్యాంక్ సాధించి పుట్టిన గ్రామంతో పాటు పల్నాడు జిల్లాకు పేరు తెచ్చింది. పల్నాడు జిల్లా , రాజుపాలెం మండలం, కోటనెమలిపురి గ్రామానికి చెందిన సూరసాని పుల్లారెడ్డి, ఝాన్సీల కుమార్తె సుస్మితరెడ్డి రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించింది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సమీప పట్టణమైన ప్రైవేటు పాఠశాలలో చదివింది. ఇంటర్మీడియట్ రెండేళ్లు విజయవాడ ప్రైవేటు కళాశాలలో చదివింది. ఏపీ ఈఏపీ సెట్ రెండవ ప్రయత్నంలో 554వ ర్యాంక్ సాధించింది. మొదటి నుంచి వ్యవసాయంపై మక్కువ ఉండడంతో తండ్రి వ్యవసాయం చేస్తుతుండంతో ఏజీబీఎస్ చేయాలని నిర్ణయించుకున్నట్లు సుస్మితరెడ్డి తెలిపింది. అనంతరం సివిల్స్ చేయాలని కోరిక ఉందని సుస్మితరెడ్డి తెలిపింది.

వ్యర్థాల నిర్వహణ మన అందరి బాధ్యత

మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : పారిశుద్ధ్యం నిరంతర ప్రక్రియ అని, గృహాలు, సామూహిక ప్రాంతాల నుంచి వస్తున్న వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి.. పునర్ వినియోగంతో ఆదాయ వనరుల సమకూర్చు కోవచ్చని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 21 వ వార్డు కౌన్సిలర్ కాకుమాను రవి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన డస్ట్ బిన్ (చెత్త బుట్టల) పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వ్యర్థాలను సమగ్రంగా నిర్వహించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. తద్వారా వ్యాధుల నివారణే కాకుండా, మున్సిపాలిటీకి, వ్యక్తిగతంగా కుటుంబాలకు కూడా ఆదాయం, ఆరోగ్యం లభిస్తాయన్నారు. గృహిణులు కుటుంబాల నుంచి వచ్చే వ్యర్థాలలో తడి చెత్త- పొడి చెత్త , హాని కరమైన చెత్త వాటిని వేరు చేసే విధానం పట్ల అవగాహన కల్పించి తమ తమ బాధ్యతను గుర్తు చేయటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. స్వచ్ఛత సహకారానికి, పరిశుభ్రమైన సత్తెనపల్లిని నిర్మించేందుకు మన మందరం కలిసికట్టుగా కృషి చేద్దాం అన్నారు. ప్రతి ఇంటికి రెండు డస్ట్ బిన్లు చొప్పున 670 గృహాలకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, ఆకుల రమేష్, కోఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, శిరిగిరి వెంకట్రావు, బండి మల్లిఖార్జున రెడ్డి, షేక్ గని, ఆకుల హనుమంతురావు, బచ్చు మనోహర్, నందం పెద్దన్న, తిరుముల, ప్రజాప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.

ఈ-ఆటోలను ప్రారంభించిన మంత్రి



పట్టణంలో ఈ-ఆటోలను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: స్వచ్ఛ సత్తెనపల్లిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపు నిచ్చారు. సత్తెనపల్లి పురపాలక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఈ-ఆటోలను బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా సత్తెనపల్లి పురపాలక సంఘానికి 9 ఆటోలు కేటాయించడం జరిగిందన్నారు. నిత్యం వార్డుల్లో అందుబాటులో ఉంటూ స్వచ్ఛత మెరుగు పడేందు కు సమష్టి కృషి చేయాలన్నారు. ముందుగా ఈ-ఆటోల జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశి వరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, కమిషనర్ కొలిమి షమ్మీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారధి, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కాకుమాను రవి, నాయకులు షేక్ మౌలాలి, తుమ్మల వెంకటేశ్వరరావు, రాజవరపు శివ నాగేశ్వరరావు, వల్లెం నరసింహారావు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

అమరావతి-బెల్లంకొండ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే



అధికారులతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గ ప్రజల చిరకాలవాంఛ అమరావతి-బెల్లంకొండడబుల్ లైన్‌రోడ్డు నిర్మాణం కార్యరూపంలో దాల్చడంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకర రావు మండల పరిధిలోని ధరణికోట నుంచి జూపూడి గ్రామం వరకు రోడ్డును పరిశీలించారు. ఈనెల 12వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన ఈ రోడ్డు పనులు వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధికారులకు సూచించారు. అధికారులతో కలిసి సుమారు 12కి లోమీటర్ల రోడ్డును ఎమ్మెల్యే శంకర రావు పరిశీలించిన అనంతరం కల్వర్టులు, వంతెనలు, అలాగే గ్రామాల్లో రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరమున్న చోట ఖచ్చింతంగా వెడల్పుచేయాలన్నారు. ఈపరిశీలనలో రహదారులు మరియు భవనాలశాఖ డిఈ కృష్ణారెడ్డి, ఏఈ పున్నారావులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత

సత్తెనపల్లి: మండలంలోని రెంటపాళ్ళ గ్రామంలో అగ్ని ప్రమాదానికి నష్టపోయిన బాధితులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాలు మేరకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటీ సూచనల మేరకు రెడ్ క్రాస్ చేయూత అందించేందుకు ముందుకు వచ్చింది. బుధవారం రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్ రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు బుధవారం గ్రామాన్ని సందర్శించి అగ్నిప్రమాద బాధితు లైన గుంజి చిన్న పెరమ్మ, గుంజి అక్కిలి శివప్రసాద్ లను పరామర్శించారు. అనంత రం బాధితులకు వంట పాత్రలు, దుప్పట్లు, హైజీన్ కిట్స్, నిత్యవసర వస్తు సామగ్రిని అందజేశారు.

చేపల చెరువులో విషప్రయోగం..?

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని చేపలచెరువులో సుమారు పదివేలకు పైగా చేపలు నీటిపై తేలాడుతూ కనిపించాయి. బుధవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన గ్రామస్తులు గమనించి చెరువు నిర్వాహకులకు సమాచారం అందించారు. అప్పటికే చాలా చేపలు నీటిపై తేలాడుతూ ఉండగా, మరి కొన్ని ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. ప్రాథమికంగా చెరువులో విషప్రయోగం జరిగిందని నిర్వాహకులు వైఎస్సార్ సీపీ నాయకుడు మధిరవెంకటేశ్వరరెడ్డి ఆరోపిస్తున్నాడు. నీటిపై తేలాడుతున్న చేపలను బయటకు వేశారు. ఏడు ఎకరాల చెరువులో చేపల పెంపకం కోసం రెండు నెలల క్రితం జరిగిన వేలం పాటలో వెంకటేశ్వరరెడ్డి 1లక్షా 35వేలకు వేలం పాడుకున్నాడు. 20 వేల కు పైగా పిల్లలను వేశాడు. ఇప్పటికే సుమారు రూ.9 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టినట్లు నిర్వాహకుడు వెంకటేశ్వరరెడ్డి చెబుతున్నాడు. ఈ రోజుకు సుమారు పదివేల చేపలు మృతి చెందాయని, రేపటికి ఎన్ని చనిపోతాయో తెలియదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. అయితే చేపల మృతిపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఆక్సిజన్ అందక చనిపోయి ఉండవచ్చని కొందరు అంటున్నారు. మృతి చెందిన చేపలను పరీక్షల నిమిత్తం క్రోసూరులోని మత్యశాఖ నిర్వహించే పరీక్షా కేంద్రానికి వెళ్ళారు. మూడు రోజుల్లో ఫలితాల నివేదిక అందిస్తామని చెప్పినట్లు వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. అధికారుల నివేదిక అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని నిర్వాహకుడు తెలిపారు.

విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట



పెద్దమక్కెనలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ విజయకుమారి

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని కంకణాలపల్లి గ్రామ సర్పంచ్ చెరుకూరి ఒన్నూర్ అన్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. సర్పంచ్ చెరుకూరి ఒన్నూర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు కోసమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు.

పెద్దమక్కెన గ్రామంలో.....

జగనన్న విద్యా కానుక పేద విద్యార్థులకు వరమని పెద్దమక్కెన ఎంపీటీసీ యాంపాటి విజయకుమారి అన్నారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు యాంపాటి కోటిరెడ్డి, వద్దుల వేమారెడ్డి, కందుల ధనుంజయరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, సురేష్ తదితరులు ఉన్నారు.

నకరికల్లు: విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని వైఎస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలో జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. పేదలకు విద్య దూరంకాకూడదని మధ్యాహ్నభోజనం, పౌష్టికాహారం, పుస్తకాలు, బూట్లు, బ్యాగ్, నోట్‌పుస్తకాలు, హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రొండా మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, ఉపాధ్యాయులు సుబ్బారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరావతి: మండల పరిధిలోని మల్లాది జెడ్పీ హైస్కూల్‌లో నాలుగో సంవత్సరం విద్యాకానుక పంపిణీ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపాజ్వాలా లక్ష్మీనరసింహారావు పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన విద్యాకానుక కిట్లను 154 విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, మాజీ ఎంపిటీసీ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వెంపావాసు, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్చంపేట: ప్రతి విద్యార్థి బాగా చదువుకునేందుకే ప్రభుత్వం జగనన్న కానుకలు ఇస్తోందని ఎంపీపీ భూక్యా రజనీభాయి అన్నారు. మండలంలోని తాడువాయితండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు పంపిణీ చేశారు. మంచి బ్యాగు, టెస్ట్ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్స్, బెల్ట్ వంటి వాటిని ఉచితంగా ఇస్తున్నందుకు బాగా చదువుకుని ముఖ్యమంత్రి జగనన్న ఆశయాలను నెరవేర్చాలన్నారు.

రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకునేలా చూడాలి

సత్తెనపల్లి: రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకునేలా చూడాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. సత్తెనపల్లి మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయ కులు, గ్రామ ఉద్యాన సహాయకులు, బహుళ ప్రయోజన విస్తారణాధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులు ఎవరైతే ఇంకా పీఎం కిసాన్ ఈ-కేవైసీ చేయించుకోనటువంటి రైతులు ఈ-కేవైసీ చేయించుకునే విధంగా సిబ్బంది చూడాలని సూచించారు. పంటసాగు హక్కు దారుల పత్రాల (సీసీఆర్‌సీ కార్డులు) పై రైతులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించి రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగు చేస్తున్న ప్రతి రైతు పంట సాగు హక్కు పత్రం కలిగి ఉండాలని, దానికోసం రెవెన్యూ శాఖ ద్వారా ఇస్తున్న సీసీఆర్‌సీ దరఖాస్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే ఖరీఫ్ సీజనకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రంలో సిద్ధం గా ఉంచుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్న పచ్చి రొట్ట విత్తనాలైన జనుము, జీలుగా విత్తనాలు 50 శాతం రాయితీ పై రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో 25 మట్టి నమూనాలు సేకరించి వాటి నాణ్యత ఫలితాలు రైతులకు అందజేయాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సిబ్బందికి వివరించారు.

ప్రతి కుటుంబానికి పక్కా గృహం నిర్మిస్తాం



మృతిచెందిన చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న రఘునాథబాబు

అచ్చంపేట: అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి పక్కా గృహం నిర్మిస్తామని, విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలోని పెదపాలెంలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదంలో ఇళ్లుకోల్పోయిన కుటుంబాలను ఫోనుద్వారా ఆయన పలుకరించారు. తన సోదరుడు నంబూరు రఘునాధబాబుచే తక్షణ సహాయాన్ని పంపారు. ప్రమదంలో సజీవదహనమైన చిన్నారి కుటుంబానికి రూ.50వేలు అందజేశారు. ఇళ్లుకోల్పోయిన ప్రతి కుటుంబానికి రూ.5వేలు చొప్పున పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలందరికి పునరావాసం కల్పించి, వంటసామగ్రి, వంట దినుసులు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నంబూరు రఘునాధబాబు మాట్లాడుతూ ఈ సహాయం కేవలం ఎమ్మెల్యే వ్యక్తిగతంగా అందించేదని, ప్రభుత్వపరంగా ప్రతి ఒక్కరికీ పక్కా గృహం నిర్మించడం జరుగుతుందని, వారి జీవనానికి కావలసిన సదుపాయాలన్నీ కల్పించడం జరుగుతుందని చెప్పారు. ప్రమాదంలో గాయపడిన కుటుంబాలకు వైద్యఖర్చులన్ని తామే భరిస్తామని, త్వరగా కోలుకునేవరకు కుటుంబాలను ఆదుకుంటామన్నారు. గ్రామ సర్పంచ్ నెల్లూరి హరిబాబు, వైసిపి నాయకులు నెల్లూరి చంద్రబాబు, మార్కెట్‌యార్డు డైరెక్టరు చిరుమామిళ్ల నరసింహారావు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, ఉప సర్పంచ్ జానిభాషా తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్ల ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గత నాలుగు ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివ రించాలన్నారు. ఏవైనా సమస్యలున్నా .. అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందక పోయినా వెంటనే తెలియ జేయాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, కోవిడ్ కష్టకాలంలో కూడా ఏ ఒక్క పథకం అమలు ఆగలేదన్నారు. ప్రస్తుతం అమల్లోని సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట సంక్షేమ వెలుగులు నెలకొన్నాయన్నారు. ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు, పథకాలు మంజూరు చేశారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు కూడా చురుగ్గా నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్నారని అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అత్యధిక శాతం మంది ప్రజల హృదయాల్లో జగన్‌మోహన్ రెడ్డి సుస్థిరంగా నిలిచిపోయారని, ప్రజల ఆశీస్సులు మనకు ఉన్నాయన్నారు. కష్టపడి పని చేస్తే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడా నికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుకా జయపాల్, సచివాలయాల మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు కొణతం స్వాతి (సత్తెనపల్లిటౌన్), బొంతు వెంకటరామిరెడ్డి (సత్తెనపల్లి రూరల్), రెండెద్దుల వెంకటే శ్వరరెడ్డి(ముప్పాళ్ళ), పులిబండ్ల అశోక్ (రాజుపాలెం), మేడా ప్రవీణ్ రెడ్డి(నకరికల్లు), పలువురు సర్పంచులు, మండల స్థాయి నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ శారీరక శ్రమను అలవర్చుకోవాలి



ఎక్సర్ సైజులు చేస్తున్న వైద్య సిబ్బంది

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ శారీరక శ్రమ చేయాలని, మానశిక ప్రశాంతతకు యోగా చేయాలని వైద్యాధికారి డాక్టర్ శ్యామల అన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగానే స్థానిక జెడ్పీహెచ్ స్కూలు విద్యార్థులు, ఆశవర్కర్స్, పీహెచ్‌సి సిబ్బందిచే అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఆశ, ఏఎన్ం, వైద్య సిబ్బందిచే యోగా, ఎక్సర్‌సైజులు చేయించారు. ఈ కార్యక్రమంలో 17 వరకు జరుగుతుందని డాక్టర్ శ్యామల తెలిపారు. ప్రతి పని యంత్రాలతో చేయడానికి అలవాటుపడడం వల్ల శారీరక శ్రమకోల్పోతున్నారన్నారు. యంత్రాలు రాకపూర్వం ఇంట్లో పనులన్నీ చేతులతో చేసుకునేవారని, అందువల్లనే ఆరోగ్యవంతంగా ఉండేవారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.పార్వతి, సీహెచ్ఒ శివనాగేశ్వరి, పీహెచ్ఎన్ మేరీ జాన్స్, హెచ్‌వి ఎలిజిబెత్, బేబీరాణి, ఎంపిహెచ్ఎస్‌లు రాధాకృష్ణ, భాగవదాసు, స్టాఫ్‌నర్సులు, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

యోగా, సైక్లింగ్‌తో ఆరోగ్యకరమైన జీవనం

నకరికల్లు: చెడుఅలవాట్ల నుంచి దూరంగా ఉంటే సంపూర్ణమైన ఆరోగ్యం సిద్ధిస్తోందని డాక్టర్ వి.శ్రీనునాయక్, డాక్టర్ బి.నాగమణి అన్నారు. స్థానిక పీహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య మేళా, అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం ద్వారా రక్తపోటు అదుపులో ఉంటుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని తద్వారా ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చన్నారు. ముందుగా స్థానిక పీహెచ్‌సి నుంచి ర్యాలీ నిర్వహించి పలు అంగన్‌వాడీకేంద్రాల్లో అవగాహనాసదస్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.మల్లయ్య, సూపర్‌వైజర్‌లు పి.బ్రమరాంబ, వై.విజయమ్మ, వి.జ్యోతి, వైద్య సిబ్బంది వి.నారాయణరెడ్డి, ఏ.సువర్ణకుమారి, ఎం.మల్లేశ్వరీబాయి, ఎం.రాణి, పి.నాగరాజు, షేక్.షాహీదు, డి.బాజీబి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: ప్రతి రోజూ యోగ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని పీహెచ్‌సీ వైద్యురాలు పీ.రమాదేవి చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ మేళాలో భాగంగా సైక్లింగ్ ర్యాలీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రతి రోజూ గంట పాటు యోగా, సైక్లింగ్ చేసినట్లయితే శరీరంలోని అన్ని భాగాలు ఉత్తేజమై కొవ్వు లాంటి వ్యర్థాలు కరిగిపోయి ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ నుంచి ముప్పాళ్ళ జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల పీఈటీ ఎస్.కె.సుబాని, సూపర్ వైజర్లు పీటర్ డానియేస్, జోస్పిన్‌రాణి, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భట్లూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మీ కవిత

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు.శ్రీలక్ష్మి కవిత బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో జనరల్ ఓపీ 45 మంది, హైపర్ టెన్షన్ 30 మంది, డయాబెటిస్ 34 మంది, గర్భిణులు 16 మంది, బాలింతలు ఐదుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు.

రాజుపాలెం: మండలంలోని గణపవరంలో ఫ్యామిలీ డాక్టర్ బుధవారం వైద్య సేవలు అందించారు. డాక్టర్ రవి తేజనాయక్ 73 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. 22 మందికి బీపీ, 19 మందికి షుగర్ బిల్లలను 15 రోజులకు సరిపడ మందులను అందించారు. ఆరుగురు గర్భిణులను, నలుగురు బాలింతలను పరీక్షలు చేసి మందులను అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని స్థిలో ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్ పీ శిరీష, ఏఎన్ఎం ధనలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ సాధిక్ హుస్సేన్, డిఈఓ చెవుల పూర్ణచంద్రరావు, ఆశ కార్యకర్తలు సంతోషం, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ పాల్గొని 78 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్ళి వారికి అవసరమైన వైద్య సేవలందించారు. కార్యక్రమంలో డీఈఓ రవితేజ, ఎమ్‌పీహెచ్ఎస్ కరిముల్లా, ఏఎన్ఎమ్ ఆదిలక్ష్మి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన రావూరి

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు(బొర్రయ్య) రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ పార్టీ క్షేత్రస్థాయి అభివృద్ధికి, రానున్న ఎన్నికల్లో విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామానికి చెందిన నల్లపునేనిమాణిక్యారావు, శిరిగిరివెంకట్రావు లు చేరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్ నిమ్మకాయలరాజనారాయణ, మాజీ వైస్ఎంపీపీ ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, శిరిగిరిగోపాలరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.